సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం। 4। ఫిబ్రవరి। 2024

కథ చెబుతాం..

వేములవాడఅర్బన్: కులవృత్తుల్లోనే ఉపాధి వెతుక్కుంటున్నారు. వంశపారంపర్యంగా వచ్చిన కులవృత్తికి గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఒక వైపు చదువుకుంటూనే.. మరో వైపు కులవృత్తులైన ఒగ్గుకథలు చెబుతున్నారు. మల్లన్నపట్నాలు, భీరప్ప పూజలు చేస్తూ పల్లెల్లో ఆధ్యాత్మికతను నింపుతున్నారు. నిండా పాతికేళ్లు నిండని యువకులు ఒగ్గుకథలు చెబుతూ కనుమరుగయ్యే దశలో ఉన్న కులవృత్తికి జీవం పోస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పల్లెల్లో ఒగ్గుకథలు చెబుతున్న యువకులపై ఈ సండే స్పెషల్..

- వివరాలు 8లో...



కారుచౌక జర్నీ

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న 'కార్ పూలింగ్' కల్చర్



సండే స్పెషల్

- తక్కువ చార్జీకే ప్రయాణం
- రాజధాని, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు యాప్‌లో సీటు బుకింగ్
- ఉద్యోగుల ప్రాధాన్యం దీనికే..
- నచ్చిన చోట పికప్, డ్రాప్ సదుపాయం
- ఇంధనం, డబ్బు ఆదా

నగరానికి చెందిన అఖిల్ అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. బస్సుల్లో రద్దీ చాలా ఉంది. రిజర్వేషన్ లోనూ సీట్లు లేవు. వెంటనే తన వద్ద ఉన్న ఓ కార్‌పూలింగ్ యాప్ ఓపెన్ చేసి, సీటు బుక్ చేసుకుని రాజధానికి వెళ్లిపోయాడు అఖిల్.

బదిలీల అనంతరం ప్రభుత్వ ఉద్యోగులు సైతం నలుగురు లేదా ఐదుగురు ఎంప్లాయిస్ కలిసి కార్ పూలింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకే ఆఫీసులో పనిచేయడం, కారు అయితే స్టాపుల్లేకుండా నేరుగా ఆఫీసుకే వెళ్లే వీలుండటంతో కార్ పూలింగ్‌కు మొగ్గు చూపుతున్నారు.



అద్దెకారు జర్నీ ఖరీదైంది. ఇద్దరు.. నలుగురు కలిసి కరీంనగర్ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వెళ్లాలంటే రూ.5వేలకు తక్కువ ఖర్చవడం లేదు. పెరిగిన ఇంధన ధరలు, ఖర్చుల నేపథ్యంలో అంతకన్నా తక్కువ తీసుకుంటే తమకు గిట్టుబాటు కాదని కారు నిర్వాహకులు చెప్పేస్తున్నారు. బస్సుల్లో రద్దీ, సమయం వృథా, సిటీలో ట్రాఫిక్ జామ్ నేపథ్యంలో సరే అని కారులో వెళ్లిపోతున్నారు. అయితే అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీ కారు ప్రయాణాన్ని చౌకకే అందిస్తోంది. కార్ పూలింగ్‌కు కొన్నియాప్‌లు అందుబాటులో ఉండగా ఉమ్మడి జిల్లా నుంచి చాలామంది సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లేవారు.. అక్కడి నుంచి ఇక్కడికి వచ్చేవారు కార్ పూలింగ్ ద్వారా ప్రయాణం చేస్తున్నారు. తక్కువ ధరకే షేరింగ్ జర్నీ చేస్తూ సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. కారు నిర్వాహకులకు సైతం ఇం'ధన'ం ఆదా అవుతోంది. అసలేంటీ 'కారు'చౌక జర్నీ అనుకుంటున్నారా..? చదవండీ సండే స్పెషల్..!!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో కార్ పూలింగ్ కల్చర్ పెరిగిపోతోంది. పెరిగిన రద్దీతో ఉద్యోగులు, విద్యార్థులు ఈ విధమైన ప్రయాణానికి పెద్దపీట వేస్తున్నారు. జిల్లా కేంద్రాలైన కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల నుంచి ప్రతీరోజు రాజధానితో పాటు వరంగల్, మంచిర్యాల, గోదావరిఖని, నిజామాబాద్ ఇలా ఏ ప్రాంతానికైనా కార్ పూలింగ్‌కే జై కొడుతున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ తరువాత ఆ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న నగరం కరీంనగర్. ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాదిమంది హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై, చెన్నై తదితర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, కార్పొరేట్ తదితర మల్టీనేషనల్ కంపెనీల్లో కొలువు చేస్తున్నారు. వీరంతా వారాంతానికి ఉమ్మడి జిల్లాకు రావడం, తిరిగి సోమవారం ఉదయానికి వారి ఉద్యోగస్థానాలకు వెళ్లడం రివాజుగా మారింది. దీనికి తోడు ప్రతిరోజూ కోర్టు కేసులు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు, రకరకాల అవసరాల రీత్యా రాజధానికి వెళ్లేవారి సంఖ్య లెక్కేలేదు.

ఉమ్మడి జిల్లాలో కార్ల సంఖ్య ఇలా

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కార్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. బ్యాంకుల సులభ వాయిదా రుణాలు, మార్కెట్‌లోకి కొత్త కార్లు వస్తుండటం, కరోనా తరువాత భౌతిక దూరానికి ప్రాధాన్యం పెరగడంతో సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్ కూడా ఊపందుకుంది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో రిజిష్టర్ అయిన కార్ల వివరాలే నిదర్శనం.

కరీంనగర్:	47,023
సిరిసిల్ల:	11,911
జగిత్యాల:	12,824
పెద్దపల్లి:	10,400

టోల్‌గేట్‌ల వద్ద తాకిడి

పాత జిల్లాలో రెండు ప్రధాన టోల్‌గేట్లు ఉన్నాయి. ఇందులో ఒకటి కరీంనగర్ జిల్లా రేణికుంట వద్ద కాగా, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వద్ద రెండోది ఉంది. ఈ టోల్‌గేట్ల మీదుగా ప్రతిరోజూ రాకపోకలు సాగించే కార్ల వివరాలు ఇలా ఉన్నాయి.


టోల్‌గేట్	హైదరాబాద్ వైపు	హైదరాబాద్ నుంచి
రేణిగుంట	5,500 సుమారు	5,000 సుమారు
బసంత్‌నగర్	1,500 సుమారు	1,100 సుమారు

ఓనర్, రైడర్‌కు మేలు

ఈ యాప్‌లు కార్లు లేని వారికే కాదు సొంత వాహనాలు ఉన్న వారికీ సౌకర్యంగా ఉంటుంది. చాలా మంది ఉమ్మడి జిల్లాకు వివిధ పనులు, పండుగలు, సెలవులకు వచ్చి, కుటుంబ సభ్యులను దింపి తిరిగి ఒంటరిగా వెళ్తుంటారు. అంటే దాదాపు గంటల కొద్దీ ప్రయాణం ఒంటరిగా చేయాలి. అదే సమయంలో కరీంనగర్ నుంచి పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వెళ్లే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు తమ కొలీగ్స్ రానప్పుడు ఈ యాప్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎవరికైనా పెట్రోల్ ఖర్చు ఆదానే కదా. అందుకే, బ్లాబ్లా కార్, క్విక్‌రైడ్ యాప్‌లో రైడ్ వివరాలు పోస్టు చేస్తున్నారు. క్షణాల్లో కారు ఖాళీ సీట్లు నిండిపోతున్నాయి. కారు ఓనరూ ఆర్టీసీచార్జీలే తీసుకుంటుండటంతో జర్నీలో టైంపాస్, పెట్రోల్ చార్జీలు కలిసి వస్తున్నాయి.

నచ్చిన చోట పికప్.. డ్రాప్

ఈ యాప్‌తో మరో సదుపాయం ఏంటంటే.. హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లినప్పుడు ముందు రైల్వేస్టేషన్/బస్టాండ్‌లో దిగుతాం. అక్కడి నుంచి మనం అనుకున్న స్థానాలకు వెళ్లాలంటే క్యాబ్‌లకు రూ.200, 300 పెట్టాలి. ట్రాఫిక్‌తో గంటలపాటు ఇరుక్కుపోతుంటారు. కానీ, ఈ యాప్ ద్వారా ఓనరు ప్రయాణించే మార్గంలో మనకు నచ్చిన చోట దిగవచ్చు. ఉదా: నిమ్స్ వెళ్లాలనుకుంటే మెహదీపట్నం వెళ్లే కారును ఎంచుకోవచ్చు. హైటెక్ సిటీ వెళ్లాలనుకుంటే కొండాపూర్ వెళ్లే కారును సెలెక్ట్ చేసుకుని, అక్కడే దిగిపోవచ్చు. చాలా కార్లు ఓఆర్ఆర్ మీదుగా వెళ్తుండటంతో సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి.



సమయానికి చేరుకోవచ్చు



హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు కార్ పూలింగ్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ప్రయాణించడం ద్వారా సమయం, డబ్బులు ఆదా అవుతున్నాయి. ఎలాంటి ఆలస్యం లేకుండా గమ్యానికి అనుకున్న సమయంలోనే చేరుకునే వెసులుబాటు ఉంది. వివిధ వ్యాపారాల రీత్యా దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కార్ పూలింగ్ యాప్‌ను ఎక్కువగా వినియోగించుకుంటున్నారు.

– శనిగరపు రవీందర్, ప్రభుత్వ ఉద్యోగి

న్యూస్‌రీల్

పోషకాహార లోప నివారణకు రాగిలడ్డూలు



ముస్తాబాద్(సిరిసిల్ల): చిన్నారులు, గర్భిణులు, బాలింతలలో పోషకాహార లోప నివారణకు రాగి లడ్డూలను అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్ పూజారి గౌతమి తెలిపారు. మండలంలోని పోతుగల్‌లో అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. ఫిబ్రవరిలో రాగిలడ్డూలను అందజేయనున్నట్లు చెప్పారు. వారానికి ఒక లడ్డు చొప్పున చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించాలని ఆదేశించారు. కేంద్రాలలో హాజరు శాతం పెంచాలని సూచించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీడీపీవో అలేఖ్య, ఏసీడీపీవో ఆనందిని, సూపర్‌వైజర్ అరవింద ఉన్నారు.

గురుకులం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా మైనార్టీ అధికారి

వేములవాడరూరల్: మండలంలోని మర్రిపల్లిలో గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎండీ సర్వర్ శనివారం పరిశీలించారు. రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాల నిర్వహణకు స్థానిక చర్చిలో సమావేశమయ్యారు. మైనార్టీ గురుకుల పాఠశాలలోని వసతులు, అడ్మిషన్ల ప్రక్రియ గురించి వివరించారు. తిప్పాపూర్‌లోని మసీదు పెద్దలతో మాట్లాడి అడ్మిషన్ల ప్రక్రియలో తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రిన్సిపాల్ రాజేశ్, ఉపాధ్యాయులు పూర్ణచందర్, ఉస్మాన్ షాఖాన్ పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం పనిచేయండి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: రానున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ కష్టపడి కాంగ్రెస్ పార్టీ గెలుపులో భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన వేములవాడ పట్టణ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో తన గెలుపు కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటానన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ ఇద్దామన్నారు.

పదిలో వందశాతం లక్ష్యం

- డీఈవో రమేశ్‌కుమార్



బహుమతులందిస్తున్న డీఈవో

సిరిసిల్లఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చదవాలని జిల్లా విద్యాధికారి రమేశ్ సూచించారు. స్ఫూర్తినిచ్చే విజేయుల గాథలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు అందించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిలో.. ఇంగ్లిష్ మీడియం నుంచి.. జి.విగ్నేశ్(లింగన్నపేట), డి.వైష్ణవి(వట్టిమల్ల), డి.శ్యాంచరణ్(వెల్జిపూర్), తెలుగు మీడియం నుంచి.. జి.అజయ్(మానాల), సాయిశ్రీజ(రాచర్లతిమ్మాపూర్), ఎ.తేజస్విని(సుద్దాల), బి.సంజన(సముద్రలింగాపూర్) ఉన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్ నుంచి.. కె.వర్ణిక, జి.పావని(రహీంఖాన్‌పేట), ఆర్.వైష్ణవి(గంభీరావుపేట) ఎంపికయ్యారు. సెక్టోరియల్ అధికారి సీహెచ్ పద్మ, ప్రధానోపాధ్యాయులు భాగ్యరేఖ, ఫోరం జిల్లా అధ్యక్షుడు రెడ్డి రవి, ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులపై కేసులు ఎత్తివేయాలి

సిరిసిల్లటౌన్: జిల్లాలోని పోడు రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని జిల్లా లంబాడి ఐక్యవేదిక అధ్యక్షుడు నరేశ్‌నాయక్ కోరారు. ఈమేరకు శనివారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపి మాట్లాడారు. కోనరావుపేట మండలం జైసేవాలాల్ తండాకు చెందిన సుమారు 64 మంది గిరిజన రైతులపై అధికారులు అక్రమంగా కేసులు పెట్టారన్నారు. గత ప్రభుత్వం హయాంలో అటవీ అధికారులు కక్షపూరితంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరికే పట్టాలిచ్చారని మిగిలిన వారిపై కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం పట్టించుకుని అర్హులైన పోడు రైతులకు పట్టాలిచ్చి, అక్రమంగా బనాయించిన కేసుల నుంచి విముక్తి చేయాలని కోరారు. మధుకర రాజు, భిక్యానాయక్, రంజీనాయక్, లక్ష్మీబాయి, చాంకిబాయి, కైకబాయి, కవిత పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు

వరదవెల్లి దత్త ఆలయానికి బోటు

- రూ.10 లక్షల ప్రొసీడింగ్స్ అందించిన ఎంపీ బండి సంజయ్



ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎంపీ సంజయ్

బోయినపల్లి(చొప్పదండి): వరదవెల్లి గుట్టపై మిడ్‌మానేరు ప్రాజెక్టులో ఉన్న గురు దత్తాత్రేయస్వామి ఆలయానికి వెళ్లేందుకు బోటు కొనుగోలుకు రూ.10.68 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ మంజూరు చేశారు. ఈమేరకు నిధుల మంజూరీ ప్రొసీడింగ్స్ కాపీని శనివారం మండల బీజేపీ నాయకులకు శనివారం అందచేశారు. గత డిసెంబర్ నెలలో గురుదత్తాత్రేయస్వామి జయంతి ఉత్సవాలకు హాజరైన ఎంపీ బండి సంజయ్‌కు ఆలయం చుట్టూ మిడ్‌మానేరు నీరు ఉండడంతో ఆలయంలోకి వెళ్లేందుకు ఇబ్బంది ఎదురవుతోందని, బోటు మంజూరు చేయాలని ఆలయ భక్తమండలి కోరింది. దీంతో బోటు కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తానని ఎంపీ బండి సంజయ్ హామీ ఇచ్చారు. నిధులు మంజూరు చేసిన ఎంపీకి బీజేపీ నాయకులు గుడి రవీందర్‌రెడ్డి, నర్సింహాచారి, శ్రీనివాసరెడ్డి, హరీశ్, పరశురామ్, మోహన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి

- సీఐ శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామాల్లో సంచరించే అపరిచిత వ్యక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారి కదలికలపై అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఆఫీస్‌లో శనివారం మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి గట్టి నిఘా పెంచామన్నారు. గ్రామ శివారులోని ఆలయాలను దొంగలు టార్గెట్ చేస్తున్నారన్నారు. ఎలాంటి జనసంచారం లేని ప్రాంతాలను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. దొంగతనాలపై పాత నేరస్తులను విచారిస్తున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వివిధ ఉపాధి పనుల కోసం వచ్చిన వారి వేలిముద్రలు సేకరించి, దొంగతనాలు జరిగితే అనుమానం ఉన్న వారిని విచారిస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆలయాల కమిటీ సభ్యులతో మాట్లాడి.. హుండీలలో ఎక్కువ నగదు ఉండకుండా చూసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రమాకాంత్ ఉన్నారు.

భారతరత్నకు సిరిసిల్లతో అనుబంధం

- రథయాత్రలో సిరిసిల్లకు..
- బహిరంగసభలో ప్రసంగం

సిరిసిల్లటౌన్: భారతరత్న లాల్‌కృష్ణ అద్వానితో సిరిసిల్ల ప్రాంతానికి అనుబంధం ఉంది. ఎల్‌కే అద్వాని 1990లో చేపట్టిన రథయాత్రలో భాగంగా సిరిసిల్లకు వచ్చారు. ఆ సమయంలో ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలోనూ అద్వాని ప్రసంగించారు. ఆనాటి ఫొటోలను స్థానిక బీజేపీ సీనియర్ నాయకుడు గాజుల వేణు శనివారం మీడియాతో పంచుకున్నారు. ఎల్‌కే అద్వానికి ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



అయోధ్య రథయాత్రలో సిరిసిల్లకు వచ్చిన అద్వాని

తాగునీటి సమస్య రానీయొద్దు

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా అధికారులు

సిరిసిల్ల: వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించిన సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని ఉన్నతాధికారులతో శనివారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నీటి శుద్ధి నుంచి మొదలు ఇంటింటికీ సరఫరా అయ్యే దాకా ఎలాంటి సమస్యలు ఉన్నాయో తనిఖీ చేయాలన్నారు. పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ బాగుండాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలుంటే సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కోరారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జెడ్పీ సీఈవో బి.గౌతంరెడ్డి, డీపీవో రవీందర్, డీఆర్డీవో ఎన్.శ్రీనివాస్, టెక్స్‌టైల్ ఏడీ సాగర్, మిషన్ భగీరథ అధికారులు విజయ్‌కుమార్, జానకీ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

రాష్ట్ర మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు పని విషయంలో తగ్గొద్దన్నారు. ఈనెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్యం నిర్వహణ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. శానిటేషన్‌తో పాటు, తాగునీరు, మౌలిక సదుపాయాలు, ఉపాధిహామీ తదితర అంశాలను పరిశీలించాలని, 15న గ్రామ ప్రజలతో సమావేశమై సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. ప్రత్యేకాధికారులకు వెంటనే ఒక్క రోజు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్‌లకు సూచించారు.

జిల్లా టీ-హబ్‌కు రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం

సిరిసిల్ల: రాష్ట్ర స్థాయిలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌కు ప్రథమ స్థానం లభించింది. ఉత్తమ, పారదర్శక సేవలు అందించినందుకు టీ-హబ్ ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం హర్షణీయమని కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందించారు. కలెక్టరేట్‌లో శనివారం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023లో 79,365 మంది రోగులకు 2,54,410 వైద్యపరీక్షలు చేసినందుకు ఉత్తమ సేవల విభాగంలో రాజన్న సిరిసిల్ల టీ-హబ్ ప్రథమ స్థానం పొందింది. దీనికి గుర్తింపుగా జనవరి 26న టీ-హబ్ కో-ఆర్డినేటర్ రాంప్రసాద్ మెమొంటో అందుకున్నారు. ఇదే స్ఫూర్తితో సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ సీహెచ్.సంతోష్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, వైద్యులు మనీశ్, విమల, శ్వేత, క్రాంతిరేఖ, కో-ఆర్డినేటర్ రాంప్రసాద్, సిబ్బంది హారిక, జనార్దన్, సత్యనారాయణ, శ్వేత, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

16 దుకాణాలు.. రూ.50లక్షలు పెండింగ్

- బల్దియాకు వ్యాపారుల బకాయిలు
- మటన్‌షాపులు సీజ్



మటన్‌షాపులను సీజ్ వేస్తున్న అధికారులు

సిరిసిల్లటౌన్: ఏళ్ల తరబడిగా మున్సిపల్ పన్ను చెల్లించని సిరిసిల్లలోని మటన్‌షాపులపై అధికారులు కొరడా ఝుళిపించారు. పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలోని మున్సిపల్ కాంప్లెక్సులో మటన్ వ్యాపారులను శనివారం కలిసిన అధికారులు బకాయిలు చెల్లించాలని కోరారు. బకాయిలు చెల్లించకపోవడంతో 16 దుకాణాలను సీజ్ చేశారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా.. మటన్ షాపుల్లో వ్యాపారులు 2005, 2007, 2009 నుంచి మున్సిపల్‌కు అద్దెలు చెల్లించడం లేదన్నారు. 16 షాపులతోపాటు సమీపంలో రోడ్డుపక్కన మరో 4 షాపులు కలిసి సుమారు రూ.50లక్షలకు పైగా బకాయి పడ్డట్లు వివరించారు. ఈనేపథ్యంలోనే సీజ్ వేసినట్లు తెలిపారు. మున్సిపల్‌కు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలు, అద్దెలు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

శిక్షపడితేనే నేరాలు తగ్గుముఖం

- అడిషనల్ ఎస్పీ చంద్రయ్య



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య

సిరిసిల్లక్రైం: పాతపగలతో, ఆర్థిక అవసరాలకు, క్షణికావేశంలో నేరాలకు పాల్పడిని వారికి శిక్షలు పడితేనే మరోమారు తప్పులు చేయాలంటే ప్రజలకు భయం కలుగుతుందని అడిషన్ ఎస్పీ చంద్రయ్య పేర్కొన్నారు. సిరిసిల్లలో ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో శనివారం జిల్లా పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు, కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత నెల రోజుల్లో 7 శిక్షలు పడడంతోపాటు నగదు జరిమానా విధించిన విషయాన్ని చర్చించారు. నేర నిరోధన, పరిశోధన అంశాలు కీలకమన్నారు. ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు కొనసాగించాలన్నారు. నేరాల దర్యాప్తులో ఆధునిక టెక్నాలజీని వినియోగించాలని, సాక్ష్యాలను కోర్టు ముందు ప్రవేశపెట్టినప్పుడు న్యాయస్థానాలు నమ్ముతాయన్నారు. అప్పుడే నేరస్తులకు శిక్ష పడుతుందనే భయం కలుగుతుందని స్పష్టం చేశారు. డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, అడిషనల్ పీపీ లక్ష్మీప్రసాద్, శ్రీనివాస్, సందీప్, సతీశ్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామికి సంగీత నివేదన



వేములవాడ: రాజన్న సన్నిధానంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు శనివారంతో ముగిశాయి. కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. శ్రీరాంభట్టాచార్య హరికథాగానం ఆకట్టుకుంది. ఈ వేడుకలను తిలకించేందుకు నెదర్లాండ్స్‌కు చెందిన సుసాన్ సమాధాని వచ్చారు.

క్లుప్తంగా

పదవికి మాత్రమే మాజీలం.. సేవకు కాదు

- ప్రజాసేవలో ముందుండాలి
- వేములవాడ మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



వేములవాడ: పదవికి మాత్రమే మాజీలం కావాలి.. ప్రజాసేవలో కావొద్దని వేములవాడ మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. తన జన్మదినం సందర్భంగా వేములవాడలోని నివాసంలో పార్టీ నాయకులు, అభిమానుల మధ్య శనివారం కేక్‌కట్ చేసి మాట్లాడారు. ఎప్పుడూ ఎమ్మెల్యేగా ఆర్భాటాలకు పోలేదని, మా తండ్రి నుంచి ఎన్నో పాఠాలు, అనుభవంతో వచ్చాయన్నారు. మీ అందరి సహకారంతో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని పాదయాత్ర



తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈ ఎన్నికల్లో పోటీ చేసిన రాజకీయ నాయకుడికి పీఆర్వోగా పనిచేసిన తనకు తన బృందానికి వేతనం ఇవ్వకుండా మోసం చేశారని మిట్టపల్లి శ్రీకాంత్ అనే బాధితుడు ఆరోపించాడు. తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడుతూ జనవరి 1న తాను ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినట్లు ఈ విషయమై సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపాడు. తనకు రావాల్సిన వేతనం ఇవ్వాలని న్యాయం చేయాలని కోరుతూ నిరసనగా రాష్ట్ర మానవహక్కుల కమిషన్ వరకు పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నాడు. తనను వాడుకుని మోసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగ్గురి బైండోవర్

ఎల్లారెడ్డిపేట: మండలంలో శనివారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని పోలీసులు బైండోవర్ చేశారు. మండలంలోని ఇటీవల తాళం వేసిన ఇళ్లు, ఆలయాలే లక్ష్యంగా దొంగలు పడుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. శనివారం రాత్రి మండలంలోని బొప్పాపూర్ శివారులో ముగ్గురు అనుమానాస్పదంగా తిరుతుండగా అదుపులోకి తీసుకున్నారు. బోండ్ల గణేశ్, బొమ్మనవేణి భరత్, పని అఖిల్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ రాత్రివేళలో అనుమానాస్పదంగా తిరిగిన, కనిపించిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

WANTED

Wanted Principal with Qualified M.Sc. Nursing and Minimum 5years of Experience and also Experienced and Qualified M.Sc. Nursing / B.Sc. Nursing faculty to teach in our College.

ESTD: 2003

SRKM College of Nursing
Mancherial. Contact: 8374585229, 9866231292. mail: srkmcon153@gmail.com

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ One Sitting / Regular: 10th, Inter, NIOS, TOSS, APOSS, DEG, PG, Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 9515390685, 9032284760 [H-801585]

SERVICES

ఓల్డేజ్ హోం

■ సాయి హోంకేర్ & ఓల్డేజ్: వృద్ధులకు, పేషంట్లకు అన్ని రకముల సేవలకు 24 గం. అటెండర్స్‌ను పంపగలము. (ఆయాలు, అటెండర్స్ కావలెను జీ+భో+వ ఫ్రీ) ✆ 7569630177, 9398866009. [B-1206329]

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

■ "కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త" ఇప్పుడు చిన్న పెట్టుబడితో Bussiness చేసి 1,80,000 రూపాయలు సంపాదించు కునే గొప్ప సువర్ణవకాశం, 100% Decentralization, Block Chain సంప్రదించండి. ఫోన్: 919440021305, 919866962459 [H-788194]

WANTED

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 20k ఫోన్: 8977639662/8977639663. [H-793685]

■ బాలాజీ గ్రూప్ (A.P, T.S & న్యూఢిల్లీ నెం-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5000/కమీషన్. 9133271122 / 9052671122. [H-787781]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-801571]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యాభర్తలు & గార్డెన్ వర్క్ ఆఫులను చూసుకొనుటకు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13030]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

కథ చెబుతాం..

సండే స్పెషల్

- ఒగ్గుకథలు చెబుతున్న యువకులు
- చదువు.. ఉద్యోగం.. కులవృత్తి
- తండ్రుల బాటలో తనయులు
- ఆదివారం, సోమవారం పూజాకార్యక్రమాలు
- మిగతా రోజుల్లో సాధారణ పనులు



మల్లన్నపట్నం వేస్తున్న యువ ఒగ్గు కళాకారులు



మల్లన్న పట్నాలలో ఆడ వేషధారణలో కథలు చెబుతున్న యువ కళాకారులు

వేములవాడఅర్బన్: అవును.. వాళ్లు కథలు చెబుతున్నారు. ఊ కొట్టే కథలు కావు. పెద్దల నుంచి వారసత్వంగా వచ్చిన కథలు. పల్లెల్లో ఆధ్యాత్మిక భావాలు నింపే ఒగ్గుకథలు. దశాబ్దం క్రితం కులవృత్తి అంటే చిన్నచూపు చూడడంతో జానపదుల కళలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలోనే నేటి యువత ఇటు చదువుతోపాటు అటు కులవృత్తిని ఉపాధిరంగంగా ఎంచుకుంటుంది. బీటెక్, బీఈడీ, డిగ్రీలు, పీజీలు చదువుతూనే ఒగ్గుకథలు, మల్లన్న పట్నాల కథలు చెబుతున్నారు. కులవృత్తిని కాపాడుతూనే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఒకప్పుడు మల్లన్నపట్నాలు అంటేనే కథకులు పెద్ద వయసు వారు వచ్చేవారు. కానీ నేడు పరిస్థితులు మారాయి. పాతికేళ్లు కూడా నిండని యువత మల్లన్నపట్నాల బాధ్యతలు తమ బుజాలపై వేసుకుంటున్నారు. కథలు చెబుతూ పల్లెప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

మూడు నెలలు కథలు చెబుతూ..

తాతలు.. తండ్రుల నుంచి వచ్చిన కులవృత్తిని ఉపాధిరంగంగా ఎంచుకున్న నేటి యువత డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే కథలు చెబుతున్నారు. ఈ మూడునెలల్లో ప్రతీ ఆదివారం మల్లన్న పట్నాల పూజలు చేస్తూ బిజీగా ఉంటున్నారు. ఒకరి ఇంట్లో మల్లన్నపట్నాల పూజలకు ముగ్గురు యువ కుల బృందం వెళ్లి దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారు.

కులవృత్తిపై మమకారంతో..

కులవృత్తిపై మమకారంతో ఇటీవల యువత మల్లన్నపట్నాలు, బీరప్ప కథలు చెప్పేందుకు ముందుకొస్తున్నారు. బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోనే దాదాపు 50 మంది ఒగ్గుకథ కళాకారులు ఉన్నారు. ఇందులో 20 మంది వరకు పాతికేళ్లు కూడా నిండని యువతే. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మూడు నెలల్లో ప్రతీ ఆదివారం, సోమవారం మల్లన్న పట్నాల పూజలకు వెళ్తుంటారు. కులవృత్తిని గౌరవిస్తూనే ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. బోయినపల్లి మండలానికి చెందిన కళాకారులు వేములవాడ, బావుపేట, కందికట్కూర్, వాసంపల్లి, అయ్యోరుపల్లి గ్రామల మధ్యలో విస్తరించి ఉన్న ప్రాంతంలో మల్లన్నపట్నాల పూజలు చేస్తుంటారు. వివిధ దేవుళ్లు, జానపదల కథలు చెబుతుంటారు.

చదువుకుంటూనే..



నేను ఆరేళ్లుగా మల్లన్న పట్నాలకు వెళ్తున్నాను. ఇప్పుడు బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. ఈ సీజన్‌లో పట్నాల పూజలకు తీరిక లేకుండా వెళ్తున్న. అక్కడ కథలు కూడా చెబుతుంటాను.

– అక్షయ్, బీటెక్ విద్యార్థి, ఒగ్గు కళాకారుడు

ఉద్యోగంతోపాటు కథలు



నేను 12 ఏళ్లుగా మల్లన్నపట్నాల పూజలకు వెళ్తున్నాను. చదువుకుంటూ కథలకు వెళ్లేవాడిని. ఇప్పుడు కోనరావుపేట మండలంలో ఔట్ సోర్సింగ్‌లో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. ఆది, సోమవారాల్లో మల్లన్నపట్నాల పూజలకు వెళ్తున్నాను.

– మహేశ్, ఒగ్గు కళాకారుడు

మా నాన్నతోపాటు వెళ్తున్నాను



నేను గత 8 ఏళ్లుగా మల్లన్న పట్నాలకు వెళ్తున్నాను. ఇంటర్ పూర్తి చేశాను. ప్రస్తుతం మా నాన్నతో కలిసి మల్లన్న పట్నాలకు వెళ్తున్నాను. కథలలో ఆడవేషాలు కూడా వేస్తున్నాను. ఈ సీజన్‌లో మేము మల్లన్నపట్నాలు ఎక్కువగా వేశాం.

– ప్రవీణ్, ఒగ్గు కళాకారుడు

పేర్ల కోసమే శిలాఫలకం!



వెంకట్రావుపేటలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

కోనరావుపేట(వేములవాడ): ఆ గ్రామంలోకి అధికారులు, ప్రజాప్రతినిధులు రాలేదు. తెల్లారే సరికి మంత్రులు, అధికారులు వచ్చినట్లు ప్రారంభోత్సవం చేసినట్లు శిలాఫలకాలు దర్శనమివ్వడంతో గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. తీరా శిలాఫలకంపై పేర్ల కోసం ఈ పనిచేశారని తెలియడంతో గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో కొన్నేళ్ల క్రితం ఉపాధిహామీ నిధులతో శ్మశానవాటిక నిర్మించారు. అందులో పలువురి అంత్యక్రియలు సైతం నిర్వహించారు. కాగా ఈనెల 1వ తేదీతో సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత శ్మశానవాటికకు శిలాఫలకం ఏర్పాటు చేశారు. సదరు శ్మశానవాటికను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ తదితరులు ఫిబ్రవరి 1న ప్రారంభించినట్లు శిలాఫలకం ఏర్పాటు చేయడంతో.. వారు గ్రామానికి ఎప్పుడు వచ్చారు.. ఎప్పుడు ప్రారంభించారని స్థానికులు చర్చించుకుంటున్నారు. శిలాఫలకంలో పేర్ల కోసం ఇలా చేశారని అనుకుంటున్నారు.

అనధికారిక కరెంట్ కోతలు

- అధికారులకు సమాచారం కరువు
- ఎల్లారెడ్డిపేటలో హై, లోవోల్టేజీ సరఫరా
- కాలుతున్న గృహోపకరణాలు



కాలిపోయిన టీవీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని కొద్ది రోజులుగా అనధికారికి విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఈ విషయం విద్యుత్ శాఖ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. సెస్ అధికారుల ప్రమయం లేకుండానే మండల వ్యాప్తంగా విద్యుత్ కోతలు విధిస్తుండడం, సరఫరాలో హెచ్చు తగ్గులతో గృహోపకరణాలు కాలిపోతున్నాయి. ఇంతా జరుగుతున్న సెస్ అధికారులకు పట్టింపు లేకుండా పోతోంది. ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీలో పనిచేసే దినసరి కూలీలు తమకు ఇష్టం వచ్చినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేస్తున్నట్లు తెలిసింది. శనివారం ఉదయం 11 గంటలకు కరెంట్‌ను తీసివేసి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకుండా చేశారు. దీంతో వినియోగదారులు సెస్ ఏఈకి ఫోన్ చేస్తే తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. అధికారులకు తెలియకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్‌చేసి కరెంట్ సరఫరాను నిలిపివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు బస్టాండ్ ప్రాంతంలో శనివారం హై, లోవోల్టేజీతో విద్యుత్ సరఫరాతో టీవీలు, ఫ్రిడ్జ్‌లు కాలిపోయాయి. నెల రోజుల వ్యవధిలో ఇలా జరగడం పదోసారి. ఈ విషయంపై స్థానికులు శనివారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతోపాటు ఎండీకి ఫిర్యాదు చేశారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత

- మరొకరి కోసం గాలింపు

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలో రెండు రోజుల క్రితం గంజాయి విక్రయిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సదరు యువకుడి నుంచి దాదాపు 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సిరిసిల్ల కార్గిల్ లేక్ పరిసరాల్లో బైక్‌పై వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. గంజాయి అమ్మిన వ్యక్తితోపాటు జిల్లాకు గంజాయి సరఫరా చేస్తున్న తీరును తెలుసుకునేందుకు లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం పట్టుబడిన వ్యక్తి సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సంతోష్‌గా విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. గంజాయి ముఠాను పట్టుకుని రిమాండ్‌కు పంపేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండలకేంద్రంలోని పెట్రోల్‌బంక్ ఆవరణలో రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. రుద్రంగికి చెందిన గడ్డం లక్ష్మణ్ స్థానిక పెట్రోల్‌బంకు నుంచి తన ద్విచక్ర వాహనంపై బయటకు వస్తుండగా అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరుణ్, రవి, రిషి ముగ్గురు తమ బైక్‌పై కోరుట్లకు వెళ్తుండా ప్రమాదం జరిగింది. దీంతో రవి, గడ్డం లక్ష్మణ్ తీవ్రంగా గాయపడగా, అరుణ్, రిషి స్వల్పంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను కోరుట్లలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఓబులాపూర్‌లో చోరీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన బత్తుల నర్సయ్య ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.30వేల నగదు, 60 తులాల వెండి చోరీ చేసినట్లు బాధితుడు వాపోయాడు. తంగళ్లపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపిక



ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండల కేంద్రానికి చెందిన విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు సీహెచ్ రిశ్వంత్, సీహెచ్ వర్షిణి, టి.హాసిని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జనవరి 27న మండల స్థాయిలో నిర్వహించిన పరీక్షలో జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. శనివారం జిల్లాస్థాయి టాలెంట్‌టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని డీఈవో రమేశ్ కుమార్, విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ లతీఫ్, ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, మండల ఇన్‌చార్జి గంగయ్య అభినందించారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో గంభీరావుపేట మండలం లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విగ్నేశ్‌గౌడ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.

తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన గీతకార్మికుడు సుద్దాల కొండయ్యగౌడ్ శనివారం కల్లుగీస్తూ తాటి చెట్టు పై నుంచి కిందపడ్డాడు. చెట్టు పై నుంచి పడిన కొండయ్యగౌడ్‌ను స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పాలస్తీనాకు మద్దతుగా నిలుద్దాం

సిరిసిల్లటౌన్: ఇజ్రాయెల్ నుంచి రక్షించేందుకు పాలస్తీనాకు మద్దతుగా నిలుద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్ల కార్మిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఈనెల 4న సాయంత్రం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ఏర్పాటు చేసిన పాలస్తీనా సంఘీభావ సదస్సుకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పంతం రవి, సోమ నాగరాజు, నల్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యం మత్తులో ఆటో నడుపుతూ.. స్టాపర్‌బోర్డును ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో బోల్తాపడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని రాచర్లగొల్లపల్లి-ఎల్లారెడ్డిపేట గ్రామాల మధ్య ఉన్న పెట్రోల్‌బంక్ ఎదుట శనివారం రాత్రి కామారెడ్డి నుంచి సిరిసిల్ల వెళ్తున్న ఆటో అతివేగంగా వచ్చి స్టాపర్ బోర్డును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న నరేశ్‌గౌడ్ గాయపడ్డాడు. నరేశ్‌గౌడ్ ఆటోలోనే చిక్కుకోగా, స్థానికులు బయటకు తీసి 108లో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

మార్కండేయ శోభాయాత్రకు రండి..





మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు ఆహ్వానం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో జరిగే మార్కండేయ జయంతి వేడుకలకు రావాల్సిందిగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పద్మశాలి సంఘం నాయకులు శనివారం ఆహ్వానించారు. ఈనెల 12న మార్కండేయ జయంతి సందర్భంగా జరిగే శోభాయాత్రలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానపత్రిక అందించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఆహ్వానించినట్లు సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మండల సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, పద్మశాలి సంఘం నాయకులు డాక్టర్ గాజుల బాలయ్య, మోర రవి, కాముని నళినీకాంత్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

- సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్
- సిరిసిల్ల-వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యులకు క్రీడా పోటీలు



ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రవీందర్

వేములవాడ: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్ అన్నారు. వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలానగర్ క్రికెట్ మైదానంలో శనివారం నిర్వహించిన వేములవాడ-సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన వేములవాడ అడ్వకేట్ల జట్టు 14.3 ఓవర్లలో 101 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. 102 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సిరిసిల్ల అడ్వకేట్ల టీమ్ 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని చేరుకుంది. 47 పరుగులు చేసిన కేసరి శ్రీనివాస్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఏజీపీ గుడిసె సదానందం, వేములవాడ, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, కోడి లక్ష్మణ్, కార్యదర్శులు నక్క దివాకర్, అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు తిరుమల్‌గౌడ్, విద్యాసాగర్‌రావు, వంగల కర్ణ, మ్యాచ్ ఆర్గనైజర్ సంటి సుజీవన్, వేములవాడ, సిరిసిల్ల న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత

- బీఆర్‌ఎస్ నేతలు అహంకారం వీడట్లేదు
- పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ భూస్థాపితమే
- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కే.కే.మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: మహిళా సాధికారతకు కాంగ్రెస్ సర్కారు ప్రాధాన్యతనిస్తుందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మహేందర్‌రెడ్డి సమక్షంలో స్థానిక ఏడు, ఎనిమిది వార్డులకు చెందిన సుమారు 80 మంది కాంగ్రెస్‌లో చేరారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారం పోయినా.. ఆ పార్టీ నేతల్లో అహంకారం పోలేదన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజావ్యతిరేక పాలన సాగించిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. మహిళలకు ఇచ్చిన కాంగ్రెస్ హామీలు ఇప్పటికే రెండు అమలయ్యాయని, త్వరలోనే మిగతావి సైతం అమల్లోకి వస్తాయన్నారు. ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ అవుతాయన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, దుబాల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్ కోరారు. మండలంలోని గజసింగవరంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ వర్గీకరణ బిల్లుకు అనుకూలంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనలో షెడ్యూల్ కులాల్లోని 59 కులాలను వేర్వేరుగా గణన చేయాలని కోరారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లతోపాటు విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ అంశాల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఈనెల 6న అన్ని మండల కమిటీలు వేసుకొని, మాదిగలు, మాదిగ ఉపకులాలు ఏకతాటిపైకొచ్చి ఐకమత్యం చాటాలన్నారు. జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, కో కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సౌదీలో వలసజీవి మృతి

- బండపల్లిలో విషాదం



భూమయ్య(ఫైల్)

చందుర్తి(వేములవాడ): స్వగ్రామానికి వచ్చి.. వెళ్లిన పదిహేను రోజులకే సౌదీలో గుండెపోటుతో వలసజీవి మృతిచెందడంతో మండలంలోని బండపల్లిలో విషాదం అలుముకుంది. బండపల్లికి చెందిన పోతు రాజు భూమయ్య(45) జీవనోపాధి కోసం ఐదేళ్లుగా సౌదీ అరేబియా వెళ్లి వస్తున్నాడు. కాగా మూడు నెలల క్రితం ఇంటికొచ్చి, పదిహేను రోజుల క్రితమే సౌదీ వెళ్లాడు. శుక్రవారం తన గదిలో స్నేహితులతో కలిసి భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు. అదే సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. అతని స్నేహితులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కడు పేదరికంలో ఉన్న కుటుంబానికి పెద్ద దిక్కు గుండెపోటుతో మృతి చెందడంతో శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతునికి తల్లి మల్లవ్వ, భార్య లక్ష్మి, కుమారుడు మారుతి, కూతురు కళ్యాణి ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు గుర్తించండి

- 8న తుది ఓటరు జాబితా
- 5 నుంచి ఈవీఎంల తనిఖీలు
- అఖిలపక్ష నేతలతో కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టరేట్‌లో అఖిలపక్ష నేతలు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఓటరు జాబితాలో తప్పులను గుర్తించాలని, ఎలాంటి పొరపాట్లు లేని జాబితాను సిద్ధం చేసేందుకు అన్ని రాజకీయ పక్షాల నాయకులు సహకరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో శనివారం అఖిలపక్ష నేతలు, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల మొదటిస్థాయి తనిఖీ చేపడతామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా తయారీ, సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్దాపూర్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ యార్డ్‌లోని గొడౌన్‌లో భారత ఎన్నికల సంఘం ఆదేశాలతో చేపట్టనున్న ఈవీఎంల మొదటిస్థాయి తనిఖీలు చేస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, డబుల్ ఓటర్లు, చనిపోయిన వారిని గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని సూచించారు. తుది ఓటరు జాబితా ఫిబ్రవరి 8న ప్రకటించాలన్నారు. అదనపు కలెక్టర్లు ఎస్.ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, సిరిసిల్ల తహసీల్దార్ ఎండీ షఫీ మొహియొద్దీన్, వివిధ పార్టీల నాయకులు వెల్ముల తిరుపతిరెడ్డి, గజభీంకార్ రాజన్న, లింగంపల్లి మధుకర్, తీగల శేఖర్‌గౌడ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.